క్లుప్తంగా

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

కడియం: దుళ్ల గ్రామ దేవత పోలేరమ్మ ఆలయంలో పోతురాజుబాబు, నాగమ్మ విగ్రహాలను గురువారం ఉదయం 8.30 గంటలకు వైభవంగా ప్రతిష్ఠించారు. శైవగమ పండితుడు బాదంపూడి సత్యనారాయణ శర్మ పర్యవేక్షణలో వేదపండితులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు రోజులుగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. నూతన విగ్రహాలకు ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ



యూనిఫాం పంపిణీ చేస్తున్న శ్రీనివాస్ తదితరులు

కడియం: మండలంలోని బుర్రిలంకకు చెందిన చిరుసేవా సమితి వ్యవస్థాపకుడు గెడ్డం శివ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ప్రియదర్శిని చెవిటి, మూగ పిల్లల ఆశ్రమంలో విద్యార్థులకు గురువారం స్కూలు యూనిఫాం పంపిణీ చేశారు. సినీనటుడు చిరంజీవి పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిపారు. జనసేన నాయకుడు వై.శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది.

ట్యాబ్ ఆధారిత ఆన్‌లైన్ పరీక్షలు



సీబీఎస్ఈ పరీక్షల తీరును పరిశీలిస్తున్న డీవైఈవో నారాయణ

కంబాలచెరువు: సీబీఎస్ఈ తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలల్లో ట్యాబ్ ఆధారిత ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ తెలిపారు. స్థానిక లాలాచెరువు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను గురువారం ఆయన పరిశీలించారు. జిల్లాలోని 15 పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలులో ఉందని, రాజమహేంద్రవరం అర్బన్‌లో రెండు పాఠశాలల్లో ఈ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు ఎ.మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రూ.కోటి చొప్పున నష్టపరిహారం ఇవ్వాలి

రాజమహేంద్రవరం రూరల్: అనకాపల్లి అచ్యుతాపురంలో ఎస్ఈజెడ్‌లోని ఎసేన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ డిమాండ్ చేశారు. బొమ్మూరులోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫార్మా కంపెనీలో బుధవారం రియాక్టర్ పేలి 18 మంది మృతి చెందారన్నారు. భవన శిథిలాల కింద ఎన్ని మృతదేహాలు ఉన్నాయో తెలియదన్నారు. పేలుడు సమయంలో 300 మంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, ఈ ప్రమాదంపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

కడియం: హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఈ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కోనసీమ సేవా మండలి సభ్యుడు ఎన్‌డీ కృపారావు అన్నారు. స్థానిక జూనియర్ కాలేజీ, హైస్కూలు విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం సంస్థ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఈ వ్యాధిని గురించి చర్చించాలని, తోటి వారికి అవగాహన కలిప్పించాలన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి నిలపాలన్నారు.

సినిమాలు

శ్యామల	డబుల్ ఇస్మార్ట్
సూర్యమినీ	ఏలియన్
సూర్యప్యాలెస్	డిమోంటీ కాలనీ-2
స్వామి	డిమోంటీకాలనీ-2
అశోక	ఆయ్
శివజ్యోతి	మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
అనుశ్రీ	కమిటీ కుర్రోళ్లు
రాజా	మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
రంభ	ఇంద్ర
ఊర్వశి	తంగలాన్
మేనక	రేవు, స్త్రీ-2
కుమారి	ఏలియన్, పరాక్రమం
అప్సర	మిస్టర్ బచ్చన్
నామవరం	
వీఎస్ మహల్	మారుతీనగర్ సుబ్రహ్మణ్యం,ఆయ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	ఆయ్
కడియం	
వెంకటసూర్య	తంగలాన్, ఆయ్

అప్రమత్తతే ఆరోగ్యానికి రక్ష

- స్పర్శ లేని మచ్చలలో ప్రమాదం
- అంగవైకల్యానికి గురయ్యే అవకాశం
- కుష్టువ్యాధి నివారణకు చర్యలు
- వైద్య,ఆరోగ్యశాఖ విస్తృత సర్వే



కుష్టువ్యాధి సర్వే నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

కంబాలచెరువు: ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు చెబుతారు. మనిషికి ఆరోగ్యమే అసలైన సంపద అని దాని అర్థం. నేడు అనేక రకాల రోగాలు మనపై దాడి చేస్తున్నాయి. దానికి కారణాలు ఏమైనప్పటికీ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి. రోగాల నుంచి ప్రజలను కాపాడటానికి వైద్య, ఆరోగ్య శాఖ అనేక చర్యలు చేపడుతోంది. దానికి ప్రజలు సహకరిస్తే చాలు. వైద్య సిబ్బంది ఇటీవల కుష్టు వ్యాధి సర్వేను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటింటికి వైద్య సిబ్బంది వెళ్లి ప్రజలను సర్వే చేస్తున్నారు. శరీరంపై అనుమానాస్పద మచ్చలు ఉంటే గుర్తించి, వైద్య చికిత్స అందిస్తున్నారు. కుష్టువ్యాధి నిర్మూలనలో భాగంగా ఈ కార్యక్రమం అన్నిచోట్లా జరుగుతోంది.

స్పర్శలేని మచ్చలుంటే..

శరీరంపై ఉండే మచ్చలలో స్పర్శ లేకుండా ఉన్నవి ప్రమాదకరం. వీటి వల్ల కుష్టు వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. ప్రాథమిక దశలోనే అలాంటి మచ్చలను గుర్తిస్తే చికిత్స తీసుకుని, సమస్య నుంచి బయటపడవచ్చు. కుష్టు మాట వింటేనే ఒకసారిగా గుండెల్లో ఏదో తెలియని భయం. ఈ వ్యాధి నిర్మూలనకు, ప్రజల్లో అవగాహనకు, కుష్టు రహిత సమాజాన్ని నిర్మించేందుకు వైద్య ఆరోగ్య శాఖ కృషి చేస్తోంది.

విస్తృతంగా సర్వే

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ పేరుతో రాజమహేంద్రవరంలో వ్యాధిగ్రస్తులను గుర్తించే చర్యలు చేపట్టారు. అనుమానిత కేసులను గుర్తించే పనిలో వైద్యసిబ్బంది బిజీగా మారారు. ఇంటింటికీ తిరిగి అనుమానిత మచ్చలున్న వారిని గుర్తిస్తున్నారు. అలాగే బ్యానర్లు, పోస్టర్లు, పాంపెట్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కుష్టువ్యాధి వల్ల కలిగే అనర్థాలను వివరించి, దానిని గుర్తించడం వల్ల కలిగే ముందస్తు ప్రయోజనాలను ర్యాలీల ద్వారా తెలియజేస్తున్నారు. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సుమారు నాలుగు లక్షల మందిని వైద్య సిబ్బంది సర్వే చేశారు. వారిలో ఇప్పటివరకు కుష్టు వ్యాధి సోకిన పదిమందిని గుర్తించారు.

లక్షణాలు ఇవీ..

- చర్మంపై స్పర్శ, నొప్పి, దురద లేని మచ్చలు
- చర్మంపై ఎరుపు, రాగి రంగు మచ్చలు
- చెవులు, వీపు, చాతీపై బొడిపెలు
- కనురెప్పలు పూర్తిగా మూయలేకపోవడం, కంటి రెప్పలు, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం
- నరాల నొప్పి, చేతులు, పాదాలు, నరాల తిమ్మిర్లు
- అరచేతులు, పాదాలలో స్పర్శ కోల్పోవడం, పొడి బారడం, నొప్పి, పుండ్లు ఏర్పడడం, చేతి, కాళ్ల వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం ఏర్పడడం
- కాళ్ల నుంచి చెప్పులు, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- మణికట్టు, మడమను పైకి లేపలేకపోవడం
- చల్లని, వేడి వస్తువులను తాకినా గుర్తించలేకపోవడం

> **ధైర్యంగా ముందుకు రండి**
>
> 
>
> శరీరంపై అనుమానిత మచ్చలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా ధైర్యంగా ముందుకు రావాలి. కుష్టు వ్యాధిని ముందుగానే గుర్తిస్తే దాని నివారణ సులభం. వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించకపోతే అనేక అనర్థాలు జరుగుతాయి. వ్యాధి సోకిన వారు తుమ్మినా, దగ్గినా ఆ తుంపర్ల నుంచి మరో వ్యక్తికి వ్యాధి సంక్రమించే అవకాశం ఉంది. అలా సోకిన క్రిమి శరీరంలో రోగ నిరోధక శక్తిని బట్టి కనీసం ఏడాది నుంచి 20 ఏళ్ల మధ్య కుష్టు రోగం బయట పడుతుంది. వ్యాధి బాధితులు సక్రమంగా మందులు వాడడం ద్వారా తమను రక్షించుకోవడంతో పాటు ఇతరుల ప్రాణాలను రక్షించవచ్చు.
>
> – నమ్మి వసుంధర, జిల్లా కుష్టువ్యాధి నిర్మూలన అధికారి

జానపదమే సంస్కృతికి ప్రతిబింబం



జానపద కళాకారులతో విజయలక్ష్మి తదితరులు

సీటీఆర్ఐ: జీవన సమరంలో కష్టసుఖాలను బాణీలుగా చేసుకొని రూపొందించిన పాటలే జానపదాలని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. సంహిత డిగ్రీ కళాశాల, కళాగౌతమి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జానపద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జానపద కళాకారులు తమ కళలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ పల్లె పాటలులోని విజ్ఞానం, వినోదాలు ఉండేవన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ మాట నుంచి పాట ఉద్భవిస్తే, పాటకు సంగీతం జత కలిసి కళగా రూపాంతరం చెందిందని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ పని, పాటకు మధ్య ఏర్పడిన విడదీయరాని బంధమే జానపదమన్నారు. కార్యక్రమంలో జైన సాహిత్య రాయబారి చీమలమర్రి శ్రీనివాసరావు, సంహిత డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ తోట రామకృష్ణ పాల్గొన్నారు.

హార్లిక్స్ ఫ్యాక్టరీ ఎన్నికల్లో విమానం గెలుపు



విజయోత్సవంలో పాల్గొన్న గోదావరి జీఎస్‌కే వర్కర్స్ యూనియన్ నాయకులు

ధవళేశ్వరం: హార్లిక్స్ ఫ్యాక్టరీ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో గోదావరి జీఎస్‌కే వర్కర్స్ యూనియన్ 495 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించింది. గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరిగింది. అనంతరం ఓట్లను లెక్కించారు. మొత్తం ఐదు యూనియన్లు కూటమిగా ఏర్పడిన గోదావరి జీఎస్‌కే వర్కర్స్ యూనియన్ విమానం గుర్తుపై పోటీ చేసింది. దీనిలో హెచ్ఎంఎం లిమిటెడ్ హార్లిక్స్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ), జీఎస్‌కే హార్లిక్స్ వర్కర్స్ యూనియన్, తెలుగునాడు వర్కర్స్ యూనియన్, చైతన్య హార్లిక్స్ వర్కర్స్ యూనియన్ ఉన్నాయి. మొత్తం 974 మంది కార్మికులకు ఓటు హక్కు ఉండగా వీరిలో ఇద్దరు ఇటీవల మృతి చెందారు. దీంతో 972 మందిగానూ 965 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో రెండు ఓట్లు చెల్లలేదు. విమానం గుర్తుపై పోటీ చేసిన గోదావరి జీఎస్‌కే వర్కర్స్ యూనియన్‌కు 729 ఓట్లు, కాగడా గుర్తుపై పోటీ చేసిన ఎస్‌బీసీబీ లిమిటెడ్ (హార్లిక్స్) ఆపరేటర్స్, వర్కర్స్ యూనియన్‌కు 234 ఓట్లు వచ్చాయి. గుర్తింపు యూనియన్ అధ్యక్షుడిగా వీరమళ్ల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా గోలి దేవసహాయం (పెద్ద) ఘన విజయం సాధించారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఫలితాల అనంతరం కార్మికులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

నేడు ఉపాధి గ్రామసభలు

కడియం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) గ్రామ సభలు శుక్రవారం ఉదయం 10 గంటలకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ జరుగుతాయని ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో, సంబంధిత పంచాయతీ కార్యదర్శి ఈ సభలను నిర్వహిస్తారన్నారు. పథకం ప్రాధాన్యత, ప్రస్తుతం పరిపాలనానుమతులు పొందిన పనులు, కొత్తగా చేపట్టబోయే పనులు, సామాజిక తనిఖీ తదితర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, సెరికల్చర్, పశు సంవర్ధకశాఖ, హార్టీకల్చర్ సిబ్బంది కూడా సభల్లో పాల్గొంటారన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులపై శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి.శ్రీనివాసరావు తెలిపారు. మండల నోడల్ ఆఫీసర్, జిల్లా గిరిజన సంక్షేమసాధికారిత అధికారి కేఎన్ జ్యోతి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గ్రామాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల గుర్తింపునకు ఈ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రక్తదాతలకు అభినందనలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీనటుడు చిరంజీవి జన్మదిన వేడుకలలో భాగంగా రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 22 వరకూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు గురువారం స్థానిక వైఎస్సార్, జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్‌బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం రక్తదాతలకు అభినందనలు తెలిపారు.

నగరంలో 'కమిటీ కుర్రోళ్లు' సందడి



ప్రేక్షకులతో మాట్లాడుతున్న నిహారిక

రాజమహేంద్రవరం రూరల్: కమిటీ కుర్రోళ్లు చిత్ర బృందం గురువారం నగరంలోని అనుశ్రీ థియేటర్‌లో సందడి చేసింది. చిత్ర సమర్పకులు, నటి నిహారిక, దర్శకుడు యదువంశీ, నటీనటులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రేక్షకులతో మాట్లాడారు. వారు చెప్పిన డైలాగ్‌లకు అనుగుణంగా హావభావాలను ప్రదర్శించారు. ముందుగా చిత్ర బృందానికి అనుశ్రీ థియేటర్ యాజమాన్యం ఘనంగా స్వాగతం పలికింది.

ఎల్ఐసీ ఉద్యోగి బెనర్జీ కృషి చిరస్మరణీయం



బెనర్జీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: జీవిత బీమా సంస్థకు చెందిన రాజమండ్రి డివిజన్‌లోని ఉభయ గోదావరి జిల్లాలను ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎంఎఫ్ బెనర్జీ ఎంతగానో కృషి చేశారని జీవిత బీమా సంస్థ రీజినల్ మేనేజర్ జీబీవీ రామయ్య అన్నారు. హుకుంపేట ఆదర్శ నగర్‌లో గురువారం మధ్యాహ్నం బెనర్జీ సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రామయ్య, ఉద్యోగుల సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉభయ గోదావరి జిల్లాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి బెనర్జీ నిరంతరం శ్రమించారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడానికి ఉద్యోగుల సంఘం తరఫున కృషి చేస్తామన్నారు. జీవిత బీమా సంస్థ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణ సాహు, సేల్స్ మేనేజర్ బొర్రా శ్రీనివాస్, ఉభయగోదావరి జిల్లాల ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు భరణీ తాతేశ్వర్, సహాయ కార్యదర్శి ఎస్ఆర్‌జే మాథ్యూస్, బ్రాంచ్ మేనేజర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అనేక ఉపయోగాలు



పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న డీఏవో మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: సేంద్రియ సాగుతో రైతులకు అనేక ఉపయోగాలు కలుగుతాయని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు అన్నారు. ఈ విధానంలో పండించిన ఉత్పత్తులను 126 దేశాలలో ఇండ్ గాప్ పొలంబడి ద్వారా రైతులు విక్రయించుకునే అవకాశం ఉందన్నారు. మండలంలోని రాజవోలులో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డాట్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వరిని ఆశించే చీడ పీడలు, తెగుళ్లకు సంబంధించి రైతులకు సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నీమస్త్రం తయారీ, ఉపయోగించే విధానాలపై అవగాహన కల్పించారు. వరిని ఆశించే రసం పీల్చే పురుగు, పేను బంక, తామర పురుగు, ఎర్ర నల్లి, తెల్లదోమలను గుడ్డు దశలో నియంత్రించటానికి నీమస్త్రం సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయాధికారి భీమరాజు, ఏఈవో పీటర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక క్వారీమార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ గురువారం రాత్రి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న గూడూరి రాధిక తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: కోల్‌కతాలో వైద్యురాలిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరి రాధిక డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కోల్‌కతా ఘటనను దేశమంతా తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న వైద్యురాలు.. ఇలా మృతి చెందడం దారుణమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఆందోళనలో వైపీఎస్ శ్యామల, డి.కుమారీదేవి, కె.వరలక్ష్మి పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య సంఘటనను ఖండిస్తూ ఈస్ట్ గోదావరి జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యాన గురువారం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. యూనియన్ సెక్రటరీ లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలకు తగిన రక్షణ కల్పించి, వారు స్వేచ్ఛగా తిరిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

కంబాలచెరువు: కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి, హత్యకు పాల్పడిన దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్ డిమాండ్ చేశారు. ఆ ఘటనను నిరసిస్తూ రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. న్యాయవాదులందరూ ప్లకార్డులు చేతపట్టుకుని జిల్లా న్యాయస్థానం బయట ప్రదర్శన చేపట్టారు. వీరేంద్రనాథ్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో అధికారంలో ఉన్న ప్రభుత్వమే దోషులకు సపోర్ట్ చేస్తూ ఆధారాలను మాఫీ చేసేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. ఈ ఘటనను హైకోర్టు, సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టడం హర్షణీయమన్నారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నాగదేవర స్వర్ణ పాప మాట్లాడుతూ సమాజంలో మహిళలపై దాడులు ఎక్కువవుతున్నాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పెళ్లూరి రమేష్, ట్రెజరర్ కర్ర హనుమంతరావు, జాయింట్ సెక్రటరీ ధర్నాలకోట వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ కాశీ శ్రీనివాసరావు, మహిళా సభ్యురాలు పద్మిని, సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కంబాలచెరువు: తరగతిలో పాఠం చెబుతున్న దళిత ఉపాధ్యాయురాలిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా యూటీఎఫ్ శాఖ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు బాధితురాలితో కలిసి గురువారం సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబును కలిశారు. లాలా చెరువు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం.సరితా రంజన్‌పై జరిగిన దాడిలో నిందితులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, సంఘటనపై విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన డీఎస్పీ మాట్లాడుతూ జరిగిన సంఘటనపై పూర్తి విచారణ జరిపించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. డీఎస్పీని కలిసిన వారిలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్, రూపస్‌రావు, కార్యదర్శి ఎన్.రవిబాబు, రమేష్ బాబు, జేవీ.సుబ్బారావు, జేడీ.సుహాసిని ఉన్నారు.

బ్యాగుల పంపిణీ

మధురపూడి: కోరుకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు గురువారం బ్యాగులు పంపిణీ చేశారు. ఆర్‌జేడీ శారద చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామచంద్రరావు పాల్గొన్నారు.

చిన్నపిల్లల్లో లోపాలకు సత్వరమే చికిత్స

రాజమహేంద్రవరం రూరల్: చిన్న పిల్లల్లో వచ్చే లోపాలను గుర్తించి వాటికి సత్వర చికిత్స అందించాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్ వైద్యులకు సూచించారు. ఆయన గురువారం రాజమహేంద్రవరంలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రం, చాగల్లు మండలంలోని అంగన్ వాడీ సెంటర్లు, పాఠశాలలను తనిఖీ చేశారు. అక్కడి పనితీరు వివరాలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ్య ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్ర, చాగల్లు ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తనూజ, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు



పరిమితికి మించి ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు

సీటీఆర్ఐ: అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో స్కూల్ పిల్లలను తీసుకుని వెళ్లే ఆటోడ్రైవర్లు నిబంధలను ఉల్లంఘిస్తున్నారు. ఆటోలలో పరిమితికి మించి విద్యార్థులను తీసుకువెళుతున్నారు. ఒక్కో విద్యార్థినిని పాఠశాలకు తీసుకు వెళ్లడానికి వారి తల్లిదండ్రుల నుంచి నెలకు కొంత మొత్తం వసూలు చేస్తారు. కానీ పరిమితిని మించి పిల్లలను తీసుకువెళ్లడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అదనంగా వచ్చే డబ్బులకు ఆశపడి ఒకే ఆటోలో పది మందికి పైగా విద్యార్థులను ఎక్కించుకుంటున్నారు. ఆటోలో ఆరుగురు, వెనక వైపు డోర్‌పై మరో నలుగురిని కూర్చుబెడుతున్నారు. డోర్‌కి ఉన్న ఇనుప గొలుసు తెగిపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. నగరంలో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఈ విధంగా విద్యార్థులను తీసుకు వెళుతున్న ఆటోలు దర్శనమిస్తున్నాయి. స్థానిక నాగరాజ మున్సిపల్ స్కూల్‌కి విద్యార్థినులు ఇలా ఆటో వస్తూ కనిపించారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో జెస్సీఫ్లోరెన్స్

బిక్కవోలు: మానవ అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీవో ఎ.జెస్సీఫ్లోరెన్స్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా ఉందన్నారు. ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీని బారిన పడుతున్నారన్నారు. ఉద్యోగం, సినిమా అవకాశాల పేరుతో వారిని మోసం చేసి విదేశాలకు విక్రయిస్తున్నారన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ 28 ఏళ్లుగా డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారుల సమన్వయంతో ఇప్పటి వరకు 28,200 మంది అమ్మాయిలు, మహిళలను కాపాడి పునరావాసం కల్పించిందన్నారు. ఎంపీడీఓ ఝాన్సీ మాట్లాడుతూ సెల్ ఫోన్, ఇంటర్నెట్ ద్వారా యువతులు సైబర్ ట్రాపింగ్‌కు గురవుతున్నారన్నారు. సమావేశంలో ప్రజ్వల ఎన్‌జీవో కోఆర్డినేటర్ శ్రావ్య శృతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శాంతి రత్న కుమారి, పద్మావతి, కృష్ణ కుమారి పాల్గొన్నారు.